క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంజనేయులు, ప్రచార కార్యదర్శిగా కవిత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా నవీన్, హరిసింగ్, లింగయ్య, కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఇటీవల మరణించిన ప్రైవేట్ టీచర్ అరుణకు నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘం వార్షికోత్సవ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, నాగమణి, నర్సిరెడ్డి, ప్రమీల, శ్రీనివాసచారి, కృష్ణ, సైదులు, భగత్, కవిత, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై దుష్ప్రచారం చేస్తున్నాడని ఫిర్యాదు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తన మిల్లుకు ధాన్యాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇవ్వమన్నాడని సోషల్ మీడియాలో నీలా సత్యనారాయణ అనే వ్యక్తి దుష్ప్రచారం చేస్తున్నాడని కోదాడకు చెందిన గింజల రమణారెడ్డి పట్టణ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు నీలా సత్యనారాయణపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా పోశం నర్సిరెడ్డి దరఖాస్తు



ఎంపీ టికెట్‌కు దరఖాస్తు అందజేస్తున్న నర్సిరెడ్డి తమ్ముడు వీరారెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చెందిన ఐరా రియాలిటీ సంస్థ ఎండీ పోశం నర్సిరెడ్డి నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసినట్లు తెలపారు. ఆదివారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో దరఖాస్తును అతడి తమ్ముడు పోశం వీరారెడ్డి అందజేసినట్లు తెలిపారు.

కుంట ఆక్రమణను విరమించుకోవాలి

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్‌లో శ్మశానవాటిక పక్కనే ఉన్న కుంటను కొలకొండ రామయ్య అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలని స్థానికులు ఆదివారం డిమాండ్ చేశారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను శ్మశానవాటిక భూమిని సహితం వదలడం లేదని, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు కాపాడాలని గ్రామస్తులు కోరగా క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు రెవెన్యూ సిబ్బందిని పంపనున్నట్లు తహసీల్దార్ ప్రకాష్‌రావు తెలిపారు.

బుడ్డయ్య మృతికి సంతాపం



బుడ్డయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

గరిడేపల్లి : మండలంలోని పోనుగోడు గ్రామానికి చెందిన చామకూరి బుడ్డయ్య సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. నీతి నిజాయితీకి నిలువుటద్దంగా బుడ్డయ్య నిలిచాడని, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం తనవర్గ ప్రజల ఆశయ సాధన కోసం అభ్యున్నతి కోసం జీవించడమే గొప్ప లక్షణమని, అలాగే తన జీవితకాలం పేద ప్రజల ఆశయ సాధనకు జీవించిన బుడ్డయ్య త్యాగధనుడని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కాసాని సైదులు, ఎల్లబోయిన సింహాద్రి, చిలకరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తెల్లబల్లిలో తాగునీటి ఎద్దడి

నడిగూడెం : మండల పరిధిలోని తెల్లబల్లి ఎస్సీకాలనీలో 15రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. కాలనీకి తాగునీటిని సరఫరా చేసే బోరు 15రోజుల కిందట మరమ్మతు కావడంతో కాలనీలో తాగునీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పట్టించుకొనే నాథుడే కరువయ్యారని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో మూడు చేతిపంపులు నిరుపయోగంగానే ఉంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరుతో పాటు, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు భవనాలు కరువు

- అద్దె భవనాలు, పాఠశాలల్లో కొనసాగుతున్న కేంద్రాలు
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, సిబ్బంది



బేతవోలులో నూతనంగా నిర్మించి ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం



ఆర్లెగూడెంలో శిథిలావస్థ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

చిలుకూరు : చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. కేంద్రాలు అద్దె భవనాల్లో, శిథిల పాఠశాలల భవనాల్లో నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన మౌలిక వసతులు లేక ఇరుకు గదుల్లో చిన్నారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో చిలుకూరు, బేతవోలు రెండు సెక్టార్లు ఉన్నాయి. ఈ రెండు సెక్టార్లు పరిధిలో మొత్తం 40అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. చిలుకూరు పరిధిలో 19, బేతవోలు పరిధిలో 21అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. బేతవోలు సెక్టార్ పరిధిలో బేతవోలులోని 6సెంటర్లకు గతంలో ఒకటే పక్కా భవనం ఉండేది. ప్రస్తుతం నూతనంగా 5నూతన భవనాలు నిర్మించారు. కాని వాటిని ఇప్పటికీ అంగన్‌వాడీలకు అప్పగించలేదు. జెర్రిపోతులగూడెంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక కేంద్రానికి భవనం ఉండగా, రెండు సెంటర్లకు భవనాలు లేవు. ఆచార్యులగూడెంలో ఓ కేంద్రం ఉండగా ఇక్కడ స్వంత భవనం లేదు. ఆర్లెగూడెంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా మూడు సెంటర్లకు భవనాలు లేవు. రామచంద్రానగర్‌లో ఓ అంగన్‌వాడీ కేంద్రం ఉండగా అక్కడ పక్కా భవనం లేదు. కొండాపురంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో ఓ కేంద్రంకు పక్కా భవనం లేదు. సీతారాంతండాలో ప్రాథమిక పాఠశాల మూసీవేయడంతో ఆ పాఠశాలలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

చిలుకూరు సెక్టార్ పరిధిలో..

చిలుకూరులో పరిధిలో మొత్తం 7అంగన్‌వాడీ సెంటర్లకు గాను ఒక సెంటర్‌కు మాత్రమే భవనం ఉంది. మిగిలిన 6సెంటర్లకు భవనాలు లేవు. రామాపురంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక కేంద్రానికి మాత్రమే భవనం ఉంది. సీత్లాంతండాలో రెండు సెంటర్లకు ఒక సెంటర్‌కు మాత్రమే భవనం ఉంది. మరో భవనం అసంపూర్తిగా ఉంది. దూదియాతండాలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు గాను ఒక కేంద్రానికి, నారాయణపురంలోని నాలుగు అంగన్‌వాడీలకు కాను రెండు కేంద్రాలకు, మొత్తం చిలుకూరు సెక్టార్ పరిధిలోని 19అంగన్‌వాడీ కేంద్రాలకు 9భవనాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో భవనాలు లేని చోట పాఠశాలలో నడుస్తున్నాయి. ఈ విషయంపై ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భవనాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రణాళికలు తయారు చేశాము



మండలంలో 40అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. రెండు సెక్టార్లు పరిధిలో 21కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. వీటికి సంబంధించి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రణాళికలు తయారు చేశాము. త్వరలో ఎమ్మెల్యేకు ప్రణాళిక అందజేస్తాము. భవనాలు లేని చోట పాఠశాలల్లో, అద్దె భవనాల్లో నిర్వహిస్తాం.
– సునీత, సూపర్‌వైజర్, చిలుకూరు

చెరువు అలుగు నిర్మాణ పనులు పూర్తి



పోలీసులు, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో కొనసాగుతున్న చెరువు అలుగు నిర్మాణం

చిలుకూరు : మండలంలోని బేతవోలు వీర్లదేవిచెరువు అలుగు నిర్మాణ పనులు ఎట్టకేలకు ఆదివారం పూర్తియింది. గత ఆగస్టు 1న చెరువు శిఖంలోని మునక భూముల రైతులు పలువురు చెరువు అలుగు ఎత్తు ఉండడంతో పొలాలు ముంపునకు గురవుతున్నాయని అలుగును ధ్వంసం చేశారు. అయితే అప్పటి నుంచి నేటి వరకు చెరువు అలుగుపై వివాదం రగులుతుంది. మునకభూముల రైతులు అలుగు ఎత్తు తగ్గించాలని, చెరువు నుంచి నీరు వృథాగా పోతున్నాయని భవిష్యత్‌లో చెరువు ఆయకట్టు భూములకు నీటి సమస్య వస్తుందని మరికొంత మంది రైతులు వాగ్వాదం చేసుకుంటున్నారు. ప్రస్తుతం సాగర్ నీరు విడుదల కావడంతో సాగర్ ప్రధాన కాలువ నుంచి బేతవోలు చెరువు నింపేందుకు కాలువ ఎస్కేప్ షట్టర్ ద్వారా చెరువుకు నీళ్లు విడుదల చేశారు. దీంతో మళ్లీ చెరువు నీరు వృథా అవుతుందని తక్షణమే చెరువు అలుగు నిర్మించాలని పలువురు రైతులు సంబంధిత అధికారులను కోరారు. దీంతో చెరువు అలుగు పనులు ప్రారంభించి నేటికి పూర్తి చేశారు. ఈసారి ఎవరైనా చెరువు అలుగును అక్రమంగా తొలగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఇరిగేషన్ డీఈ స్వప్న, ఏఈ మానస హెచ్చరించారు.

గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ఆర్సీఓ అరుణకుమారి, ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం గురుకుల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 500మంది విద్యార్థులకు గాను 482మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి తెలిపారు. కాగా పరీక్షా కేంద్రాన్ని గురుకుల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆరోగ్యానికి మార్షల్‌ఆర్ట్స్ దోహదం



తైక్వాండోలో వివిధ బెల్టులు సాధించిన విద్యార్థులు, కోచ్, తల్లిదండ్రులు

హుజూర్‌నగర్ : శారీరక మానసిక ఆరోగ్యానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదం చేస్తాయని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ సెక్రటరీ, కోచ్ అంబేద్కర్ అన్నారు. తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో నేర్చుకోవడంతో విద్యార్థులకు చదువులో, ఉద్యోగ అవకాశాల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పట్టణంలో రెండేళ్లుగా తైక్వాండో నేర్చుకుని ఎల్లో, ఎల్లో వన్, గ్రీన్ బెల్టులను సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జామినర్ అనిల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తున్న బీజేపీ



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను



నేరేడుచర్ల : అభివాదం చేస్తున్న నాయకులు



మోతె : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ పట్టణ, మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తూ పేదలు, కార్మికులు, రైతులు అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద విధానాలపై దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే దేశవ్యాప్త నిరసనలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు హసన్‌మియా, హుస్సేన్, తిరపయ్య, పర్వతాలు, రాంబాబు, రాజు, సీతయ్య, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, కనకయ్య, సైదులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : ఈనెల 16న నిర్వహించే భారత్‌బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు కోరారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెంలో నిర్వహించిన పార్టీ ప్రజా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నరేంద్రమోదీ కార్మిక చట్టాలను అణిచివేసి కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలను చేకూర్చినందుకు నిరసనగా భారత్ బంద్‌ను పాటిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు సింహాద్రీ, శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, ఉదర వెంకన్న, వెంకట్, అంజయ్య, సైదయ్య ఉన్నారు.

మోతె : దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న నిర్వహించే కార్మికుల భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. ఆదివారం మండలంలోని రావిపహాడ్‌లో బంద్‌కు సంబంధించిన పోస్టర్ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం మతతత్వ విధానాలను దిక్కరిస్తు ప్రతిఘటన పోరాటాలకు పూనుకోవాలన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బీజేపీ అధికారంలోకి వచ్చి 10సంవత్సరాలు పూరైనా నేటికి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. సింగరేణిలో నాల్గొవ బొగ్గుగనిని వేలం వేయడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. దేశంలో మతతత్వ శక్తులను పెంచి పోషించడానికి రామాలయ నిర్మాణాన్ని ముందుకు తెచ్చిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ఈనెల 16న నిర్వహించే భారత్‌బంద్‌లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, అబ్బసాలి, సొడయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

అర్వపల్లి : గతేడాది ఏప్రిల్‌లో వడగళ్ల వానతో వరి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. అర్వపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతేడాది ఏప్రిల్‌లో జాజిరెడ్డిగూడెం మండలంలో కురిసిన వడగళ్ల వర్షానికి సుమారు 6 వేల ఎకరాల్లో వరిపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. రైతులు రూ. ఏడుకోట్ల మేర నష్టపోయారని తెలిపారు. నష్టపరిహారం చెల్లించాలని ఇప్పటికే సీపీఎం, రైతుసంఘాల ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టామని చెప్పారు. జిల్లా మంత్రి, కలెక్టర్లు వెంటనే జోక్యం చేసుకొని రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, మట్టిపల్లి సైదులు, కోట గోపి, శిగ వెంకన్న, సంపతి వెంకన్న, శిగ శ్రీను, శ్రీకాంత్, రవికుమార్, వీరయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



బహుమతులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

సూర్యాపేటటౌన్ : దశరథ మెమోరియల్ ఫౌండేషన్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవలు అందించడం అభినందనీయమని జిల్లా సెక్టోరియల్ అధికారి జనార్దన్ అన్నారు. దశరథ హరికృష్ణ స్మారక వార్షిక పోటీలను ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపయోగపడే అనేక రకాల కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, మెడల్స్, షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ కె.సురేష్‌కుమార్, లింగాల శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి శ్రావణ్‌కుమార్, చంద్రశేఖర్, చింతరెడ్డి రామలింగారెడ్డి, సుధీర్‌రెడ్డి, కోటయ్య, సాలయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై కాంగ్రెస్ నాయకుల హర్షం



కోదాడ : ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పాలకవీడు : మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ, గ్రామస్తులు

కోదాడ : పది సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని కోదాడ నియోజకవర్గానికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే 10వేల ఎకరాలకు నీరందించే రెండు ఎత్తిపోతల పథకాలకు రూ.41.40కోట్ల నిధులు మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం కాంగ్రెస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉత్తమ్, పద్మావతి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా మూతపడిన ఉత్తమ్‌పద్మావతి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.4.40కోట్లు మంజూరు చేయడంతో 5వేల ఎకరాలకు, 10గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పాలేరు వాగుపై కోదాడ మండలం రెడ్లకుంట వద్ద రూ.37కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎత్తిపోతల పథకంతో రెడ్లకుంట మేజర్ చివరి భూములకు, కోదాడ మండలంలో ఐదువేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో కోదాడ ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ కృష్ణకుమారి, కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు, ఎస్‌కె.బషీర్, తుమాటి వరప్రసాద్‌రెడ్డి, రెడ్లకుంట సర్పంచ్ సాధినేని లీలా, అప్పారావు, మాతంగి బసవయ్య, అంబడికర్ర శ్రీను, మండలపు శేషు, షమ్మీ, చందర్‌రావు, ముస్తాఫా, బాగ్దాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం

పాలకవీడు : మూసీనది నుంచి రూ.33.83కోట్లతో సాగునీటికి లిఫ్ట్ మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో బెట్టితండా పరిసర గ్రామాల రైతులు సాగునీటి కోసం ఎదురుచూపులు ఫలించాయన్నారు. సాగర్ ఆయకట్టుకు చివరి ప్రాంతం కావడంతో నీటి తడులు అందక పంటలు ఎండిపోయేవని అన్నారు. పరిస్థితిని గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదన్నారు. ఈ లిఫ్ట్ నిర్మాణంతో బెట్టెతండా, పాఢ్యాతండా, సజ్జాపురం ప్రాంతాల్లోని 2,040 ఎకరాల గిరిజన రైతుల టేలాండ్ భూములకు మేలు జరుగుతుందన్నారు. తాగునీటి అవసరాల కోసం కృష్ణానది నుంచి మరో లిఫ్ట్, బెట్టెతండా, శూన్యపహాడ్ గ్రామాలను కలుపుతూ బీటీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నీమానాయక్, బండావత్ శివాజీనాయక్, శ్రీనునాయక్, నగేష్, హతీరాం, అరుణ, రవినాయక్, బాలాజీ, నాగ్య, శ్రీను, రమణ, వినోద్, కిషన్, సందీప్, నాగేశ్వరరావు, మంగ్య, శివ, మధు, శంకర్, హరి, రమేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై దాడులు చేస్తే సహించేదిలేదు



మాజీ ఎంపీపీ కవితను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

కోదాడరూరల్ : బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేదిలేదని, దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుడిబండలో ఇటీవల మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డిపై చేసిన దాడిని ఖండిస్తూ ఆదివారం ఆమెను తన నివాసంలో పరామర్శించారు. అదే విధంగా పట్టణంలో మాధవిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. తమ హయాంలో దాడులు లేకుండా ప్రశాంతంగా పాలనను అందించామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై కూడా దాడులు జరగడం సిగ్గుచేటన్నారు. దాడులు చేసిన వారిపై పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని తాము, పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా కల్పించారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

19నుంచి బ్రహ్మోత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న యోగానందచారి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి కోరారు. ఆదివారం స్థానిక దేవాలయంలో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 19 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, నాయకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పనిచేయాలి

అనంతగిరి : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగానే నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోతే బీజేపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధిచెబుతామన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, నాయకులు చిన్నంబాబు, కార్తీక్, కిరణ్, మహేష్, రవి, శ్రావణ్‌కుమార్, అజిత్ పాల్గొన్నారు.

ప్రతిష్ఠ ఉత్సవాలకు సహకరించాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో ఈనెల 17నుంచి 19వతేదీ వరకు శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ జీవధ్వజ స్తంభం, మడివాల మహాదేవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి పరివారదేవతల నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు అంజనీ సిమెంట్ పరిశ్రమ వారు సహకరించాలని ఆదివారం గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. రాత్రి వరకు కూడా చర్చలు కొలిక్కి రాకపోవడంతో చర్చలు సోమవారానికి వాయిదా వేశారు.

రెడ్లకుంట వద్ద పాలేరువాగుపై లిఫ్ట్ నిర్మాణం

- రూ.47.64కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- దాదాపు 5500ఎకరాలకు అందనున్న సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు




రెడ్లకుంట వద్ద పాలేరువాగుపై లిఫ్ట్ నిర్మించే ప్రాంతం

కోదాడరూరల్ : మండలంలోని రెడ్లకుంట వద్ద పాలేరువాగుపై నూతనంగా లిఫ్ట్ (ఎత్తిపోతల) పథకం నిర్మాణానికి ప్రభుత్వం రూ.47.64 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ లిఫ్ట్ నిర్మాణంతో రెడ్లకుంటతో పాటు సరిహద్దులో ఉన్న నల్లబండగూడెం, కాపుగల్లు, కూచిపూడికి చెందిన భూములకు సాగునీరు అందనుంది. నాగార్జున సాగర్ కెనాల్‌పై ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానంగా రెడ్లకుంట మేజర్ ద్వారా ఆ మూడు గ్రామాలకు నీరు అందాల్సి ఉంది. అయితే ఈ మూడు గ్రామాలు చివరన ఉండటంతో మేజర్‌కాల్వ పరిధిలోని సాగు చేసిన భూములకు నీరందక రైతులు ఏళ్ల తరబడి అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈ సమస్యను రెడ్లకుంటతో పాటు ఆయా గ్రామాల రైతులు గతంలో అనేక సార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలు లేవు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే పద్మావతి ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఈ సమస్యను రైతులు, నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లి లిఫ్ట్ ఏర్పాటు చేయించాలని కోరారు. దీంతో అందుకు ఆమె పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే లిఫ్ట్ మంజూరు చేయించడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లిఫ్ట్ నిర్మాణంతో 5వేల ఎకరాలకు ప్రయోజనం..


పాలేరువాగుపై లిఫ్ట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.47.64కోట్ల నిధులు మంజూరు చేసింది. 77క్యూసెక్కుల నీటి డిశ్చార్జ్ సామర్థ్యంతో రెడ్లకుంట మేజర్ 15.85కిలోమీటర్ వద్ద నీరు విడుదల కానుంది. ఈ నీటితో ఆయా గ్రామాల్లోని చివరి భూముల రైతులకు దాదాపుగా 5500వేల ఎకరాలకు నీటి సమస్య తప్పనుంది. ఇప్పటి వరకు చివరి భూములకు నీరందక అక్కడి రైతులు బావులు, బోర్ల సహాయంతో అనేక ఇబ్బందులు పడుతూ సాగుచేస్తున్నారు. ఈ లిఫ్ట్ ఏర్పాటుతో తమకు నీటి సమస్య తప్పనుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్ దంపతులకు రుణపడి ఉంటాం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గెలిచిన నెలన్నర రోజుల్లో లిఫ్ట్ మంజూరు చేయడం పట్ల మా నాలుగు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా ఈ లిఫ్ట్ మంజూరు చేయాలని అనేకమంది నాయకులు, అధికారుల చుట్టూ తిరినా ఫలితం లేకుండా పోయింది. తమకు లిఫ్ట్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రుణపడి ఉంటాం.
– సాధినేని అప్పారావు, రెడ్లకుంట

మా గ్రామాలకు నీటి సమస్య తప్పనుంది



రెడ్లకుంట మేజర్ చివరన ఉన్న మా గ్రామానికి సాగునీరు అందక అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాం. ఈ లిఫ్ట్ నిర్మాణంతో మా చివరి గ్రామాలకు నీటి సమస్య తప్పనుంది. లిఫ్ట్ మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు.
– మాగంటి ముత్తయ్య, నల్లబండగూడెం